క్లుప్తంగా

28న బీఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 28న బీఎస్ ఎఫ్19వ వార్షికోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. సభకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రవీణ్, రాము, సంతోష్, చరణ్ రాఘవ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేద్దాం



కల్వకుర్తి రూరల్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కార కోసం నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి భాగ్యమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అంగన్‌వాడీ ఉద్యోగులు అందరు పాల్గొంటునట్లు సీడీపీఓకు వివరించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయడంతో పాటు 24 రోజుల సమ్మె వేతనం చెల్లించాలనే డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, శోభవతి, జయమ్మ, మాధవి, సుజాత, నారాయణమ్మ పాల్గొన్నారు.

మైక్‌సెట్ వితరణ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఉట్లకోనేరు పురాతన ఆలయాలకు పట్టణానికి చెందిన సాదె రాజు రూ. లక్ష విలువైన మైక్‌సెట్‌ను మంగళవారం ఆలయ పూజారులకు అందజేశారు. గతంలోనూ ఆలయాభివృద్ధి కోసం రూ. 12 లక్షలు అందించి సేవ దృక్పథం చాటుకున్నారు. అచ్చమ్మపేటగా అవతరించినప్పటి నుంచి ఉట్లకోనేరులోని దేవాలయాలు ఎంతో చరిత్ర ఉందని, పురాతన ఆలయాల అభివృద్ధికి తన వంతుగా సాయం చేస్తున్నానని దాత రాజు తెలిపారు. అనంతరం దాత రాజును ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు కృష్ణమోహన్, ఉదయ్ ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

కల్వకుర్తి రూరల్: పదోన్నతులు, బదిలీల ద్వారా ఏర్పడ్డ ఉపాధ్యాయ ఖాళీలను దసరా సెలవులలోగా పూర్తిచేయాలని టీఆర్టీఎఫ్ జిల్లా కార్యదర్శి మునగాల సతీష్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో డీఈఓ రమేష్‌కుమార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలుగురు పనిచేస్తున్న పాఠశాలలో ముగ్గురు పదోన్నతిపై వెళ్లిపోవడంతో ఒకే ఉపాధ్యాయుడు విద్యా బోధన చేయడం కష్టంగా మారిందన్నారు. జిల్లాలో ఇప్పటికే 89 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు వివరించారు.

ఉద్యమాలతోనే సామాజిక న్యాయం

బిజినేపల్లి: ఉద్యమాలతోనే సామాజిక న్యాయం సాధ్యమని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ అన్నారు. మంగళవారం వారం మండల కేంద్రంలో దళిత వాయిస్ అనే బుక్‌లెట్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కొమ్ము భరత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రకటించిన దళిత డిక్లరేషన్‌కు ఇప్పటికీ విధి విధానాలు అమలు రూపొందించలేదన్నారు. శివకృష్ణ, కృష్ణయ్య, శ్రీకాంత్, రాము, శాంతయ్య, దేవరాజ్, నరసింహ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే సహించం

తాడూరు: పార్టీకి చెడ్డపేరు తీసుకొస్తే ఎంతటి వారైనా సంహించమని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లలో కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు విషయంపై మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ సందర్భంగా ఆయన స్పందించి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్‌కు షోకాజు నోటీసు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. సంక్షేమ పథకాల్లో డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పీహెచ్‌సీలో ఆర్థోపెడిక్ క్యాంపు

మన్ననూర్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్‌సీ) స్వస్తీనారీ స్వశక్తి పరివార్ అభియాన్, జిల్లా మెడికల్ నోడల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థోపెడిక్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆర్థోపెడిక్ నిపుణులు బాల్‌సింగ్ నాయక్ ఎముకల నొప్పులతో బాధపడుతున్న బాధితుల పరీక్షించి 79 మందికి ఆర్థోపెడిక్‌కు చికిత్సకు అవసరమైన పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఇద్దరిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేశారు. బాల్‌సింగ్ నాయక్, సుధాకర్, సిబ్బంది మార్తమ్మ, రామలింగమ్మ, లక్ష్మి , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ రాఘవేంద్రకాలనీలో ..



ఉమామహేశ్వరంలో..



లింగాలలో..



అమ్రాబాద్ అమరేశ్వరాలయంలో..

జగన్మాత నమో నమః

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రోత్సవాలు రెండోరోజు మంగళవారం కొనసాగాయి. జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో శివశక్తి యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. తాడూరు మండల కేంద్రంలో రవీంద్ర యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి దర్శించుకున్నారు. అచ్చంపేట శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో అమ్మవారు బ్రహ్మచారిణిగా దర్శనమిచ్చారు. కొల్లాపూర్ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని వనలక్ష్మి రూపంలో అలంకరించారు. తెలకపల్లి, పెంట్లవెల్లి, బల్మూరు, ఉప్పునుంతల, తిమ్మాజిపేట, వెల్దండ, లింగాల, పెద్దకొత్తపల్లి, అమ్రాబాద్, దోమలపెంటలో అమ్మవారిని గాయత్రీమాతగా కొలిచారు. పలు మండపాల ఎదుట మహిళలు బొడ్డెమ్మలు ఆడుతూ సందడి చేశారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.



తాడూరులో దుర్గామాత పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



పెద్దకొత్తపల్లిలో ..



కొల్లాపూర్ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



దోమలపెంట భ్రాగర్ల కేంద్రంలో..



వెల్దండలో..



కొల్లాపూర్ మండలం సింగోటంలో..



పెంట్లవెల్లి మండలం జటప్రోలులో..



తెలకపల్లి మండలం గౌరారంలో..



బల్మూర్ మండలం కొండనాగులలో..

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

పెద్దకొత్తపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గ్రామ పంచాయతీ కార్మికులకు సబ్బులు, నూనెలు, డ్రస్సులు, గ్లౌజులు, శానిటేషన్ ఇవ్వకపోవడంతో కార్మికులకు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. వారికి పెండింగ్ వేతనాలు, సామాగ్రిని అందించాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డికి కార్మికులు అందజేశారు. కార్యక్రమంలో బాలస్వామి, సిద్ధయ్య, ఆనంద్, మద్దిలేటి, మల్లయ్య, ఎల్లమ్మ, గౌరమ్మ, చంద్రకళ, మైసమ్మ పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

నూట్రిషన్ కిట్లు పంపిణీ



కోడేరు: మండలంలోని క్షయ రోగులకు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భవిష్య భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవికుమార్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ రోగులు ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలన్నారు. సిబ్బంది విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆయనను సన్మానించారు. డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అనిల్‌కుమార్, రేణయ్య, దిలీప్, ల్యాబ్ టెక్నీషియన్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తు భారత్ ఆధ్వర్యంలో 47 మంది క్షయ వ్యాధి గ్రస్తులకు మంగళవారం న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. వైద్యాధికారి నారేంద్రనాథ్ మాట్లాడుతూ న్యూట్రిషన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీహెచ్‌ఓ జీవీ శ్రీనివాసులు, శ్రీకాంత్, దుర్గమ్మ, సంపత్‌కుమార్, హన్మంతు , ప్రోగ్రామ్ ఆఫీసర్ సజ్జత్‌అలీ, ముక్తర్‌అలీ పాల్గొన్నారు.


పంట రుణాలు ఇవ్వాలి

కొల్లాపూర్: అటవీ, లావుణీ పట్టా భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పంట రుణాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.పర్వతాలు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పట్టణంలో ఆయన పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఫారెస్టు, లావుణీ పట్టా భూముల్లో అత్యధిక శాతం మంది గిరిజన, దళిత రైతులు సాగులో ఉన్నారని వీరికి పంట రుణాలు ఇవ్వడం లేదని వాపోయారు. సమావేశంలో నాయకులు శివవర్మ, తారాసింగ్, బాలపీరు, అశోక్, కిరణ్‌కుమార్, రామకృష్ణ, మధు, హనుమంతు, గోపాల్ తదితరులు ఉన్నారు.

విగ్రహ ఏర్పాటులో భగ్గుమన్న విభేదాలు

లింగాల: మండలంలోని పద్మన్నపల్లిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటులో విభేదాలు తలెత్తడంతో ఏర్పాటు చేసిన కొన్ని గంటలలోనే విగ్రహాన్ని తొలగించిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండల కేంద్రంలో ఉన్న అంబేడ్కర్ పాత విగ్రహాన్ని గ్రామానికి చెందిన ఓ పార్టీకి చెందిన నాయకులు ఏర్పాటు చేశారు. ఇది గమనించిన కొంత మంది జోక్యం చేసుకొని పాత విగ్రహం ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక వర్గం వారు విగ్రహం పెట్టగా మరో వర్గం వారు పాత విగ్రహం ఏర్పాటును వ్యతిరేకించారు. ఇది గమనించిన విగ్రహం ఏర్పాటు చేసిన వ్యక్తి తిరిగి విగ్రహాన్ని మండల కేంద్రానికి చేర్చాడు. ఇరు వర్గాల మధ్య సమస్య తీవ్ర రూపం దాల్చడంతో వివాదం పోలీసుల దృష్టికి వెళ్లింది. ఈ విషయమై ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడు వివరణ కోరగా శాంతి భద్రతలకు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధన మహోత్సవం



తెలకపల్లి: మండలంలోని గౌరారంలో ఆధ్యాత్మిక గురువు, యక్షగానం కళాకారుడు గోరటి నరసింహ 17వ ఆరాధన ఉత్సవాలు సోమవారం రాత్రి నిర్వహించారు. ఎమ్మెల్సీ వెంకన్న హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. భజన, యక్షగానం సంకీర్తనలతో ఆటపాటలతో భజన బృందం కళాకారుడు మంగళవారం తెల్లవారు జాము వరకు కళా ప్రదర్శన యక్షగానాలతో అలరించారు. ఈశ్వరయ్య, ఉపాధ్యాయుడు బాలస్వామి, ఆంజనేయులు, శ్రీశైలం, కురుమూర్తి రఘు కుమార్, అంకాలు బాలపీరు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూస్తాం

తాడూరు: యూరియా కొరత లేకుండా చూస్తామని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం సింగిల్‌విండో కార్యాలయంలో పాల్గొని రైతులతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ కారణంగా రాష్ట్రానికి వచ్చే యూరియా ఆలస్యమైందన్నారు. అయినప్పటికి యూరియా కొరత లేకుండా చూస్తున్నామన్నారు. వారం రోజుల్లో సరిపడా యూరియా వస్తుందన్నారు. రైతులను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి, రైతులు రామకృష్ణ, వెంకటయ్య, మల్లయ్య, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చెందొద్దు

ఉప్పునుంతల: యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్ రావు అన్నారు. యూరియా బస్తాల కోసం పీఏసీఎస్ వద్ద ఎగబడిన రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వానాకాలం సాగుచేసిన వరి తదితర పంటలకు సరిపడా యూరియా బస్తాలను తెప్పిస్తున్నామన్నారు. పంటలకు అవసరమైనంత మాత్రమే యూరియాను వేసుకోవాలన్నారు. ద్రవ రూపంలో అందుబాటులోకి వచ్చిన నానో యూరియాను కూడా వాడవచ్చని పేర్కొన్నారు.

బారులు తీరిన రైతులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం దగ్గర రైతులు యూరియా కోసం ఉదయం నుంచి బారులు తీరారు. కొందరికి యూరియా అందకపోవడంతో చేసేదేమి లేక రైతులు వెనుతిరిగారు.



పెంట్లవెల్లి సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు

క్రీడలతో మానసికోల్లాసం



కల్వకుర్తి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సీఐ నాగార్జున, జిల్లా యువజన అధికారి కోటా నాయక్‌లు అన్నారు. మంగళవారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాల విద్యార్థులకు కబడ్డీ, ఖో ఖో రన్నింగ్ పోటీలను స్వామి వివేకానంద సేవ బృందం, మై భారత్ జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్ మాట్లాడుతూ యువత అన్ని రంగాలలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ మాధవరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, హర్షిత్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంగళవారం పీడీఎస్‌యూ నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కార్తీక్, కార్యదర్శిగా అరవింద్, సహాయ కార్యదర్శిగా విశాంత్, సభ్యులుగా ఆదిత్య, శివలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో మండల గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి దశరథం హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికుల నూతన కమిటీ ఎన్నుకున్నారు. నూతన మండల అధ్యక్షుడిగా సులిగిరి బాలరాజును, ఉపాధ్యక్షుడిగా శాంతమ్మపరమేష్, ప్రధాన కార్యదర్శి చిట్టెమ్మ, సహాయ కార్యదర్శులుగా బత్తిని లక్ష్మి, కాశీం, కృష్ణయ్యలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రూ.51 వేలు విరాళం

చారకొండ: మండలంలోని సిర్సనగండ్లలో హనుమాన్ దేవాలయ అభివృద్ధి కోసం రామచంద్రాపురం గ్రామానికి చెందిన సోదరులు యాతం కొండల్ యాదవ్, వీరేష్ యాదవ్‌లు మంగళవారం మాజీ సర్పంచ్ యాతం శ్రీనివాస్‌కు రూ. 51 వేల నగదును విరాళంగా అందించారు. గ్రామస్తులు, దేవాలయ కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందికి ప్రతిభా పురస్కారాల అందజేత

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో విధుల నిర్వహణలో ప్రతిభ చూపిన సిబ్బందికి డీఎం ఉమాశంకర్ పురస్కారాలు అందజేశారు. మంగళవారం డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఆగస్టు నెలలో అత్యధిక ఈపీకే సాధించిన, అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లకు, ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లకు, మెకానికల్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ డిపో అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో నజీర్, మల్లేష్, గౌస్ తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందజేత



వెల్దండ: మండల కేంద్రానికి చెందిన రేవల్లి సత్తయ్య అనారోగ్యానికి గురై హైదరాబాదులో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు, నాయకులు సురేందర్‌రెడ్డి, పురుషోత్తంచారి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అమ్రాబాద్: మండలంలోని మొల్కమామిడిలో దాతల సహకారంతో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఎంపీడీఓ లింగయ్య, పీఆర్ ఏఈ శ్రీనివాసులు తదితర అధికారులు సందర్శించి పరిశీలించారు. అంగన్‌వాడీ నూతన భవనం కోసం దాత దశరథ్‌రెడ్డి ఇచ్చిన స్థలంలో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. వారి వెంట గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు జనార్దన్, ఓంకార్ తదితరులు ఉన్నారు.

చెత్త తొలగింపు



కొల్లాపూర్: పట్టణంలోని మాధవస్వామి దేవాలయం ఆవరణంలో సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీజేపీ నాయకులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కేతూరి నారాయణ మాట్లాడుతూ ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. నాయకులు సందు రమేష్, సాయికృష్ణగౌడ్, కాడం శ్రీనివాస్, తిరుమలేష్‌యాదవ్, శ్రీలక్ష్మి, భరతచంద్ర, ఓరె శేఖర్, సాలాకర్, సాయిప్రకాష్, శివయాదవ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలి

వెల్దండ: విద్యుత్ బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యుత్ ఎస్ఈ నర్సింహారెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఈని శాలువాలతో సిబ్బంది సన్మానించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎస్ఈ నర్సింహారెడ్డి మాట్లాడుతూ మండలంలో విద్యుత్ బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. మొత్తం మండలంలో 3500 విద్యుత్ కనెక్షన్‌లు, దాదాపుగా 1000 వరకు వ్యవసాయ కనెక్షన్‌లు ఉన్నట్లు సిబ్బంది వివరించారు. ప్రతి నెల బిల్లుల టార్గెట్ పూర్తి చేసుకోవాలని ఆయన ఆదేశించారు. మండలంలో దాదాపుగా రూ.కోటి వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. సిబ్బంది ప్రతి క్లస్టర్‌లో బిల్లుల కలెక్షన్ పూర్తి చేసుకోవాలన్నారు. కమర్షల్ ఫ్యాక్టరీల బిల్లులు, రైస్‌బిల్లులు, పత్తి మిల్లులు బిల్లులు, ఫంక్షన్‌హాల్ తదితర వాటి బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. బిల్లుల టార్గెట్‌లో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందికి మెమోలు జారీచేస్తామన్నారు. లైన్‌మెన్ లక్ష్మణ్ నాయక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

దేశభక్తి పెంపొందించడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం



కల్వకుర్తి రూరల్: దేశభక్తి పెంపొందించడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని ఆ సంఘం జిల్లా కార్యవాహ బొమ్మనమైన ఆంజనేయులు అన్నారు. మంగళవారం పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో సుభాష్ చంద్రబోస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విజయదశమి ఉత్సవం కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. సామాజిక సమరత, కుటుంబ జీవన విలువలు, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు పాటించాలని కోరారు. ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్ది లో భాగంగా రాబోయే రోజులలో ఇంటింటి జనజాగరణ చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎల్ఐసీ ఏజెంట్ జంగయ్య, స్వయం సేవకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రతి ఒక్కరు ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవికుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు కళాజాత బృందాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిని కట్టడి చేసేందుకు స్వరమాధురి కళాజాత బృందంతో జిల్లాలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 26 వరకు నాగర్ కర్నూల్, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతంలో కళాజాత బృందంతో పాటలు, రోల్ ప్లే ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి రాజగోపాల చారి, డీపీఓ రేణయ్య, దిశా ప్రోగ్రాం మేనేజర్ రమేష్, రవీందర్ రెడ్డి, సాయికుమార్, స్వరమాధురి కళాజాత బృంద టీం లీడర్ బి. శ్రీనివాసులు, పర్యవేక్షకులు విజయ్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

లింగాల: మండల కేంద్రానికి చెందిన విశ్వనాథ్ శంకరాచారి అదృశ్యంపై మంగళవారం కేసు నమోదైంది. ఎస్ఐ వెంకటేశ్వగౌడు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 21 తెల్లవారుజామున విశ్వనాథ్ ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. వ్యక్తికి మతి స్థిమితం లేదని ఎస్ఐ తెలిపారు. విశ్వనాథ్ సోదరుడి కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీపీగా వెంకటరమణ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సీనియర్ కోర్టులో తొలి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కోట్ల వెంకటరమణ మంగళవారం నియామకం అయ్యారు. తన నియామకానికి కృషి చేసిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు మందులను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శేఖర్

నాగర్‌కర్నూల్ క్రైం: ఆయుర్వేద వైద్యాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని జనరల్ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ శేఖర్ అన్నారు. ధన్వంతరి జయంతి సందర్భంగా మంగళవారం జనరల్ ఆస్పత్రిలో ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఆయుర్వేదంలో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవన్నారు. శిబిరంలో జిల్లాలోని ప్రముఖ ఆయుర్వేదిక్ ప్రభుత్వ వైద్యులు 200 మంది రోగులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవికుమార్ నాయక్ మాట్లాడుతూ వైద్య సేవలకు ఆది దేవుడు ధన్వంతరుడు అని అన్నారు. జిల్లాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్నటువంటి 20 ఆయుర్వేదిక్, 8 యునాని, 8 హోమియోపతి విభాగాలలో వైద్యులు డిస్పెన్సరిలో ప్రభుత్వ, జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా వైద్యులు, ఆయుష్ ఫార్మసిస్టులతో ప్రత్యేకంగా ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ గోపాల్ నాయక్, ఆయుష్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సురేష్, డాక్టర్‌అజర్ అహ్మద్, డాక్టర్ భాను ప్రకాష్, డాక్టర్ షాబజ్ మాలిక్, ఆయుర్వేద ఫార్మసిస్ట్ లు పలుస మురళి కృష్ణ గౌడ్, వెంకట్ స్వామి,యోగా సాగర్, అంజలి,బాబా తదితరులు పాల్గొన్నారు.